క్లుప్తంగా

ప్రజలు అధికారమిస్తే హత్యలు చేస్తారా?

రాష్ట్ర మైనారిటీల సంఘం నేత అలీఖాన్‌బాబా



మండపేట: రాష్ట్ర ప్రజలు మీకు అధికారాన్ని కట్టబెడితే మైనారిటీలను హతమారుస్తారా అంటూ ఏపీ మైనారిటీల సంఘం నాయకుడు షేక్ అలీఖాన్ బాబా కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేటలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల రోజులుగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సాగిస్తున్న అరాచకాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందన్నారు. మితిమీరిన దౌర్జన్య కాండతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను, ప్రజలను భయభ్రాంతులు చేస్తున్నారని అలీఖాన్‌బాబా అన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా ప్రజలను భయాందోళనకు గురి చేయరాదన్నారు. హత్యకు గురైన రషీద్ కుటుంబ సభ్యులను ఎవరూ పరామర్శించకుండా, అతడి హత్య వ్యక్తిగత కక్షతో జరిగినట్టుగా కూటమి ప్రభుత్వం చిత్రీకరించడాన్ని తప్పుబట్టారు. సంపూర్ణ మెజారిటీతో సంక్షేమ రాజ్యం, శాంతి రాజ్యం ఇస్తారనుకుంటే కూటమి ప్రభుత్వం మానభంగాలు, హత్యలు, కక్షలకు పాల్పడుతోంది తప్పితే ప్రజల కోసం పాటుపడిందేదీ లేదన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలపై దేశం కార్యకర్తలు దౌర్జన్యాలు చేయడం సబబు కాదన్నారు.

పశు వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోండి

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట: వర్షా కాలంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఎక్కువగా ఉన్నందున పశువైద్యులు అప్రమత్తంగా వుంటూ పశుపోషకులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. పట్టణంలోని రాష్ట్ర పశుసంవర్ధక శిక్షణ కేంద్రంలో రూ. కోటి వ్యయంతో నిర్మించిన అదనపు వసతి భవనాన్ని శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, 12వ వార్డు కౌన్సిలర్ మలసాని సీతామహాలక్ష్మి అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం పశు వైద్యాధికారులతో ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై. సింహాచలం, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి. శ్రీనివాసరావు, ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి. నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

నీట్ లో సత్తా చాటిన సత్యశ్రీకి సత్కారం

కపిలేశ్వరపురం: నీట్- 2024 పరీక్షలో ప్రతిభ కనబరిచిన మండలంలోని టేకి గ్రామానికి చెందిన మేడిశెట్టి సత్యశ్రీని శనివారం కపిలేశ్వరపురంలో ఘనంగా సత్కరించారు. 720 కి 696 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 2504వ ర్యాంకును, ఓబీసీ విభాగంలో 870వ ర్యాంకును సత్యశ్రీ సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మండపేట యూనిట్ అధ్యక్షుడు జిత్తుక మల్లికార్జునుడు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్యశ్రీ కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు చల్లా వెంకట్రావు సంస్మరణ సదస్సు

కపిలేశ్వరపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, ప్రముఖ హోమియో వైద్యుడు చల్లా వెంకట్రావు 16వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆలమూరులో సంస్మరణ సదస్సు నిర్వహించనున్నట్టు సంగమం సాంస్కృతిక వేదిక నిర్వాహకుడు డాక్టర్ చల్లా రవికుమార్ తెలిపారు. మండలంలోని అంగరలో శనివారం సామాజిక కార్యకర్తలు పెద్దింశెట్టి రామకృష్ణారావు, ఎం.గౌరవ్‌లతో కలిసి మాట్లాడారు. చదువులు-మానవ విలువలు, సామాజిక సమస్యలు-అధ్యయన వేదికలు, ప్రపంచీకరణ ప్రభావం-ప్రజాసంఘాల పాత్ర, చిన్నారులు-సామాజిక ప్రభావాలు, ప్రజా సైన్స్-సృజనాత్మక పద్ధతులు, యువతరం-సామాజిక బాధ్యత తదితర అంశాలపై ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖులు ప్రసంగిస్తారన్నారు. నానాటికీ పెరుగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యల పరిష్కారంపై యువత ఆలోచన చేయాలన్న లక్ష్యంతో సదస్సును నిర్వహిస్తున్నట్టు డాక్టర్ రవికుమార్ తెలిపారు.

పీఠంలో నేడు గురుపౌర్ణమి పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో ఆదివారం గురు పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని పీఠంలోని దత్తాత్రేయుడు, సాయిబాబా, శ్రీకృష్ణుడికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించడంతో పాటుగా ఆది శంకరాచార్యులు, శృంగేరి పీఠాధిపతులకు పాదుకా పూజలు, విజయదుర్గా అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఉద్యోగ విరమణ సత్కారం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పోస్టాఫీస్ ఉద్యోగి పిల్లి వెంకటరమణకు తపాలా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగ విరమణ సందర్భంగా సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్ట్ మాస్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ 40 ఏళ్ల పాటు వెంకటరమణ పనిచేసిన జగన్నాథగిరిలో ప్రజలకు మెరుగైన సేవలందించారని అభినందించారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

వాన హోరు.. రైతన్న బేజారు

- ఎడ తెరిపిలేని వర్షాలతో కలవరపడుతున్న అన్నదాత
- పలు గ్రామాల్లో నీట మునిగిన పంటలు
- 18,182 ఎకరాల్లో వరి పంట నీట మునక
- కూరగాయల పంటలకు వరుణ గండం



లొల్లలో నీట మునిగిన వరి పంట



పొంగి పొర్లుతున్న తుల్యభాగ మేజర్ డ్రైన్

రాయవరం: అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షంతో అటు రైతులు, ఇటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలకు నారుమడులు, క్లస్టర్ పరిధిలోని 120 గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోని వరి చేలు నీట మునిగాయి. ఇలాగే కొనసాగితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశముంది. వివిధ దశల్లో ఉన్న ఖరీఫ్ వరి పంట ముంపునకు గురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఇప్పటికే రైతులు నారు వేయడం నుంచి నాట్ల వరకూ ఎకరాకు సుమారుగా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఖర్చు చేశారు. వారిప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే పల్లపు ప్రాంతాల్లోని వరి పంట పూర్తిగా దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని మండపేట, రాయచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే 80 శాతం మేర వరి నాట్లు పూర్తయ్యాయి.భారీ వర్షాలకు కాలువలు, డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. క్లస్టర్ పరిధిలోని ప్రధానంగా టేకి, తుల్యభాగ మేజర్ డ్రైన్లతో పాటుగా అనపాలమ్మ, కాలేరు తదితర మైనర్ డ్రైన్లు కూడా పొంగి ప్రవహిస్తున్నాయి.

ఉద్యాన పంటలకు..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కూరగాయలు సాగు చేసే రైతులు కూడా కలవర పడుతున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో బెండ, బీర, దొండ, ఆనప, వంకాయ, టమాట తదితర కూరగాయలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కూరగాయల పంటలు కూడా దెబ్బతినే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు కూరగాయల పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా భారీ వర్షాలకు కూరగాయల మొక్కలు, పాదులకు పూసిన పూత రాలిపోతుంది. వర్షపు నీరు మూడు కంటే ఎక్కువ రోజులు నిలిచిపోయి ఉంటే మొక్కలు, పాదులు చనిపోతాయి. వర్షం ఒకటి, రెండు రోజులు కురిసి ఆగిపోవడంతో పాటు ఆ నీరంతా తీసేస్తే పూతకు కాస్త నష్టం ఉంటుంది, కానీ మొక్కలు, పాదులు చనిపోవు. అదే నీరు నిలిచిపోయి ఎక్కువ రోజులు వర్షం కురిస్తే వివిధ రకాల తెగుళ్లు వ్యాపించే ప్రమాదం ఉంటుంది. ఈ వాతావరణానికి పురుగులు అధికమై, గుడ్లు పెడతాయి. అదే కురిసిన వర్షం నీరు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు పొలాల్లోంచి దిగి పోతే పురుగులు పెట్టే గుడ్లను మందులతో నిర్మూలించవచ్చని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పొలాల నుంచి నీరు నుంచి పోయే ఏర్పాటు చేసుకోవాలి. అనంతరం మొక్కలు ఎదుగుదలకు తగిన ఎరువులు వాడాలి. తద్వారా నష్టాన్ని అరికట్టవచ్చు.

నీట మునిగిన వరి పంట మండలాల వారీగా..

మండలం	ఎకరాలు
రాయవరం	1204
మండపేట	3200
కపిలేశ్వరపురం	1160
రామచంద్రపురం	783
కె.గంగవరం	412
కాజులూరు	11,423

పల్లపు పొలాలకు నష్టం



భారీ వర్షాలకు పల్లపు పొలాలు నీట మునిగాయి. నీట మునిగిన పొలాలను లెక్కగట్టే పనిలో వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. క్షేత్ర స్థాయిలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలన చేస్తున్నాం.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం

నీరు తొలగించుకొనే ఏర్పాట్లు చేసుకోవాలి



కూరగాయల సాగు చేసే రైతులు తోటల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు నీటిని తొలగించుకోకుంటే వర్షపు నీరుకు మొక్కలు త్వరగా చనిపోతాయి. అందువలన వర్షం తగ్గిన తర్వాత ఎరువులు తగిన మోతాదులో వేసుకుంటే నష్టాన్ని నివారించుకోవచ్చు.

– ఎం.అనూష, ఉద్యానవన శాఖ అధికారి, రామచంద్రపురం

క్లస్టర్‌లో ఇదీ పరిస్థితి

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, కపిలేశ్వరపురం 1.01 లక్షల ఎకరాల్లో వరి సాగును రైతులు చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాల్లోని వరి పంట నీట మునిగింది. రాయవరం, కె.గంగవరం, రామచంద్రపురం, మండపేట, కపిలేశ్వరపురం మండలాల పరిధిలో 6,759 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లుగా వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అలాగే కాజులూరు మండలాల్లో 11423 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి

రామచంద్రపురం: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. స్థానిక వీఎస్ఎం కళాశాలలో శనివారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు బ్యాగులు నోట్ పుస్తకాలతో కూడిన కిట్లను మంత్రి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల మానసిక పరిణతిని తెలుసుకొని దానికి అనుగుణంగా విద్యాబోధన నాణ్యతతో నిర్వహించి నైతిక విలువలతో కూడిన మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులలో ప్రతిభను ఆలోచన శక్తిని అంతర్గత సృజనాత్మక శక్తులను వెలికితీసి నేటి పోటీ ప్రపంచంలో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విశ్లేషణాత్మక బోధన తప్పనిసరి అన్నారు. వినూత్న బోధన ఉపాధ్యాయుడు నుంచే పుట్టాలని పుస్తక పరిజ్ఞానంతో పాటు వాస్తవ పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులలో స్వీయ అభ్యాసనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాఠ్యాంశాలతో పాటుగా ముందున్న జీవితాలను ఆత్మస్థైర్యం, నిండు విశ్వాసాలతో సాఫల్యం చేసుకునేందుకు మార్గ నిర్దేశం చేయాలన్నారు. ఆర్డీవో ఎస్.సుధాసాగర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ చిత్రపటానికి చైర్‌పర్సన్ నివాళి



బాపిరాజు నానమ్మ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ఇటీవల వృద్ధాప్యంతో మరణించిన వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు నానమ్మ లక్ష్మమ్మకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి నివాళులు అర్పించారు. చైర్‌పర్సన్ శనివారం బాపిరాజు నివాసానికి వెళ్లి లక్ష్మమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే రామచంద్రపురం మున్సిపల్ డీఈ దుర్గాప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. రామచంద్రపురంలో ఉంటున్న ఆయన కుటుంబ సభ్యులను కూడా చైర్‌పర్సన్ అక్కడికి వెళ్లి పరామర్శించారు. మండపేట మున్సిపాలిటీలో ఏళ్లుగా సుదీర్ఘకాలం పనిచేసి పట్టణాభివృద్ధికి విశేష కృషి చేశారని దుర్గాప్రసాద్ సేవలను ఈ సందర్భంగా దుర్గారాణి కొనియాడారు. ఈ పరామర్శలలో 30వ వార్డు కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: రహదారి భద్రతా నియమాలను ప్రజలందరూ బాధ్యతగా పాటించాలని రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు సూచించారు. రామచంద్రపురం పట్టణంలోని లయన్స్ క్లబ్ హాలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రహదారి భద్రతా నియమాల గురించి అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు రహదారి భద్రతా నియమాల గురించి అవగాహన కలిగి ఉండటంతో పాటు వాటిని తప్పనిసరిగా పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అదే విధంగా మోటారు కారు ఇతర వాహనాలు నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని తెలిపారు. వాహనాలకు ఇన్సూరెన్స్, వ్యక్తిగత ప్రమాద బీమాలను తీసుకోవాలన్నారు. అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడిపే వారికి రూ.11 వేలు జరిమానా విధించడంతో పాటు లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని వివరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శారద మాట్లాడుతూ ఏదైనా రోడ్డు ప్రమాదం సంభవించినప్పుడు బాధిత కుటుంబం, అదే విధంగా ప్రమాదానికి కారణమై శిక్ష పడిన వారి కుటుంబం కూడా నష్టపోతున్నారన్నారు. అందుకే రహదారి భద్రతా నియమాలు పాటిస్తే అందరూ సంతోషంగా ఉండవచ్చన్నారు. రామచంద్రపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో సుమారుగా 20 శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వలన చనిపోతున్నారన్నారు. వీరిలో కూడా 18 నుంచి 44 సంవత్సరాల వయసులో వారు చనిపోతున్నారన్నారు. వాహన ప్రమాదాల్లో మృతి చెందడానికి హెల్మెట్ ధరించకపోవడం, అతి వేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్ వంటి రహదారి భద్రతా నియమాల ఉల్లంఘనలు కారణమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆటో డ్రైవర్లు, టాటా మేజిక్ డ్రైవర్లు, గూడ్స్ వాహనాల డ్రైవర్లు, ద్విచక్ర వాహనాల డీలర్లు, లారీ యూనియర్ సభ్యులు, శ్రీ చైతన్య డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బోధనా పద్ధతులను అభివృద్ధి పరచుకోవాలి

రామచంద్రపురం: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు బోధనా పద్ధతులు అభివృద్ధి పరచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి అన్నారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం టీచ్‌టూల్ అబ్జర్వర్స్ శిక్షణ సెంటర్‌ను డీఈవో కమకుమారి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పాఠశాలలో అబ్జర్వేషన్స్ సమర్థంగా నిర్వహించాలని, జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. శిక్షణలో ఉపాధ్యాయులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. డీవైఈఓ ఎస్.నరసింహఫణి మాట్లాడుతూ తొమ్మిదో రోజు శిక్షణలో భాగంగా 3 రోజుల శిక్షణ పూర్తయిందని, ఉపాధ్యాయులు క్రమశిక్షణతో శిక్షణ పొందటంపై ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏపీసీ ఎ.మధుసూదనరావు, స్టేట్ అబ్జర్వర్ క్రాంతికుమార్, జోనల్ అబ్జర్వర్ అనన్ పూజ, ఎంఈఓలు ఎం.శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరి, సెక్టోరియల్ అధికారులు రమేష్, సత్యనారాయణ, మాస్టర్ ట్రైనర్స్ సీహెచ్ వెంకన్నబాబు, చక్రవర్తి, రాజు, మూర్తి, సాయిసుధ, శేషారావు తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలను రక్షించుకోవాలి



పల్లిపాలెంలో ముంపుబారిన పడిన వరిపొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న ఏవో అశోక్

కాజులూరు: భారీ వర్షాలకు పంట పొలాలు ముంపుబారిన పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి(ఏవో) వి.అశోక్ అన్నారు. పల్లిపాలెం, కోలంక, ఉప్పుమిల్లి, శీల, మంజేరు తదితర గ్రామాలలో భారీ వర్షాలకు ముంపుబారిన పడుతున్న పంటపొలాలను శనివారం ఏఓ అశోక్, వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో వెదచల్లికలు, నారుమడుల దశ కొనసాగుతుందన్నారు. తడితడిగా ఉండే బురద పదునులో వరిమొక్క మొలకెత్తుతుందని అయితే గత నాలుగు రోజులుగా రోజూ ఏదో ఒక సమయంలో చెదురు మదురుగానూ, భారీ వర్షాలు పడుతూ ఉండటంతో ఇప్పుడిప్పుడే వేసిన వరినాట్లు, నారుమడులు, వెదచల్లిన పొలాలు ముంపుబారిన పడుతున్నాయన్నారు. మండల గ్రామాల్లో ఇప్పటి వరకూ 11423 ఎకరాలలో రైతులు వెదచల్లికలు, నారుమడులు చల్లుకున్నారని వర్షాలకు దాదాపు నూరుశాతం నారుమడులు, వెదచల్లిన పొలాలు నీటమునిగాయన్నారు. వరిమొక్కలు నీటిలో నానుతుండటంతో మొలకశాతం తగ్గిపోతుందన్నారు. పొలాల్లోని వర్షపు నీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లకపోతే మొలకెత్తిన నారు కూడా దెబ్బతింటుందని, నారుమడి సక్రమంగా మొలవకపోతే వరినారు కొరత ఏర్పడుతుందన్నారు. నష్టనివారణకు రైతులు తగిన చర్యలు చేపట్టాలన్నారు.

సమస్యల పరిష్కారానికి సభ్యుల డిమాండ్

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే వేగుళ్ల
- కపిలేశ్వరపురం మండల సమావేశం



సమస్యలపై అధికారిని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు పలివెల మధు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులను ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. కపిలేశ్వరపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీడీఓ కొండలరావు అజెండాను వెల్లడించగా శాఖల వారీగా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి మాట్లాడుతూ సభ్యులు ప్రస్తావించిన సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలను నిర్వహించకపోవడంపై ఎంపీపీ సత్యవేణి ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల్లో ఇంటింటా పర్యటన చేస్తూ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల ప్రతినిధులు సమాధాన మిచ్చారు. పంట, మురుగు కాలువల్లో గుర్రపు డెక్క, పూడికలతో నీటిపారుదల సమస్యలతో రైతులు సతమతమవుతున్నారని సభ్యులు సమావేశంలో ప్రస్తావించగా పరిశీలిస్తామని ఎంపీడీఓ కొండలరావు బదులిచ్చారు.

రేషన్ తూకంలో వ్యత్యాసాలు

రేషన్ సరుకుల తూకంలో వ్యత్యాసాలు వస్తున్నాయని ప్రజలు తమ దృష్టికి తెచ్చారని ఎంపీటీసీ పలివెల మధు సమావేశంలో ప్రస్తావించగా పరిశీలిస్తామని డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు బదులిచ్చారు. వరదను పరిశీలించేందుకు అద్దంకివారిలంకకు ఆర్డీఓ సుధాసాగర్ వచ్చినపుడు తనకు సమాచారం ఇవ్వలేదంటూ సర్పంచ్ నాతి గవరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కేదారిలంక లబ్ధిదారులకు కపిలేశ్వరపురం లేఅవుట్‌లో స్థలాలు మంజూరు చేశారని, దానికి బదులు తమ గ్రామంలోనే స్థలాలు మంజూరు చేయాలని సర్పంచ్ వీధి వెంకటరెడ్డి అధికారులను కోరారు. అనారోగ్యంపాలైన రోగులకు ప్లేట్‌లెట్స్ తగ్గినపుడు మండపేటలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలి పోతున్నారని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే తగిన వైద్యం అందించేలా శ్రద్ధ వహించాలని అంగర ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్ కోరారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా, డ్రైయినేజీ తదితర సమస్యలపై సభ్యులు సమావేశంలో నిలదీశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఇళ్ల పట్టా పొంది ఇల్లు నిర్మించుకోలేకపోయిన లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టవద్దని అధికారులను ఆదేశించారు. లోతట్టు నివాస ప్రాంతాల్లో నీరు నిలిచి పోతుందన్న సమస్యపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కోరుమిల్లిలో లో ఓల్టేజి సమస్యను పరిష్కరించేందుకు ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చామని, మరో 32 ట్రాన్సఫార్మర్లు మండలానికి మంజూరయ్యాయన్నారు. క్షేత్ర స్థాయిలోని సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ళను ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు సత్కరించారు.

మూడో రోజూ వీడని ముసురు

కపిలేశ్వరపురం: అల్ప పీడన ప్రభావం మూడో రోజు శనివారం కూడా ముసురు కొనసాగింది. గత రెండు రోజుల తరహాలో భారీ వర్షాలు కురవక పోవడంతో జనం ఉపశమనం పొందారు. చినుకుల ప్రభావానికి నివాసిత ప్రాంతాలు చిత్తడిగా మారాయి. పంచాయతీ కార్యదర్శులు స్పందించి బాటలు వేసి నీరును బయటకు పంపే చర్యలు చేపట్టారు. మూడు రోజులుగా వెదురుమూడి, అంగర, కపిలేశ్వరపురం, కేదారిలంక గ్రామాల్లోని ఇటుక బట్టీలు తెరుచుకోలేదు. మండలంలోని 17 గ్రామాల్లో 15,761 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా 90 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. 50 శాతం వ్యవసాయ క్షేత్రాలు వర్షపు నీటిలో తేలియాడుతున్నాయి. ప్రస్తుత పరిస్థితిలో ప్రమాదం లేదని మరి కొద్ది రోజులు అల్పపీడన ప్రభావం కొనసాగితే నాట్లు దెబ్బతింటాయని ఏవో కేవీఎస్ రమేష్ కుమార్ తెలిపారు. కాగా అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో నీట మునిగిన పంటలను ఎమ్మెల్యే వేగుళ్ల పరిశీలించారు. సాగు సంరక్షణపై తగిన చర్యలు చేపట్టాలని, రైతులకు భరోసాగా నిలవాలని వ్యవసాయశాఖ అధికారులను ఎమ్మెల్యే వేగుళ్ళ ఆదేశించారు.

నేడు సాంబశివరావు నాయుడి అభినందన సభ



జస్టిస్ సాంబశివ రావునాయుడు

రామచంద్రపురం రూరల్: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివ రావు నాయుడు అభినందన సభ రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేటి ఉదయం 9.30 గంటలకు బార్ అసోసియేషన్ భవనం వద్ద నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏజీపీ పిల్లి మురళీమోహన్‌వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశిష్ట అతిథులుగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డి.సూర్యప్రకాశరావు, ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి గంధం సునీత, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ పాల్గొననున్నట్లు తెలిపారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్‌లో దివంగత సీనియర్ న్యాయవాది పిల్లా జానకిరామయ్య వద్ద న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన జస్టిస్ సంబశివరావు నాయుడు తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన మొట్టమొదటి బార్ అసోసియేషన్ సభ్యులు అయినందున ఏర్పాటు చేసిన అభినందన సభకు బార్ అసోసియేషన్ సభ్యులు అందరూ విధిగా హాజరు కావాల్సిందిగా కోరారు.

అశిరాంబ అమ్మవారి ఊరేగింపు

కపిలేశ్వరపురం: అంగర గ్రామ దేవత అశిరాంబ వారిని శనివారం గ్రామంలో ఊరేగించారు. ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు జాతర ఉత్సవాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో అమ్మవారిని గద్దె దింపారు. అమ్మవారి గరగను విశేషంగా అలంకరించి డప్పు వాయిద్యాలతో శనివారం గ్రామంలో ఊరేగించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఔత్సాహికులు రాగం రామచంద్రరావు పర్యవేక్షణలో ఉత్సవ ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. 28న పెద్ద జాతర, 29న ఆలయం వద్ద తీర్థం, 30న నైవేద్యాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జీవనోపాధి కల్పించినప్పుడే విద్యకు సార్థకత



జాబ్‌మేళాలో పాల్గొన్న మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు

రామచంద్రపురం: చదువుకున్న విద్య, జీవనోపాధి కల్పించినప్పుడే విద్యకు సార్థకత చేకూరుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. స్థానిక వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం వికాస అవుట్ సోర్సింగ్ సంస్థ సౌజన్యంతో సుమారు 36 కంపెనీలు హెచ్‌ఆర్‌ల సహకారంతో సుమారు 2000 ఉద్యోగాలను ఆయా కంపెనీలో భర్తీ చేసేందుకు వీలుగా మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని జాబ్‌మేళాను ప్రారంభించిన మంత్రి సుభాష్ మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాల్లో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తమ శాఖ పరిధిలో ఉన్న 29 వేల పరిశ్రమలు, ఏడు వేల బాయిలర్ల పరిశ్రమలు, 95 ఈఎస్ఐ ఆసుపత్రుల్లో కూడా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళాను నిర్వహిస్తూ నిరుద్యోగ యువత నిరుత్సాహ పడకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తామని తెలిపారు. పూర్తిగా నిరుద్యోగ సమస్య నిర్మూలనకు కృషి చేస్తామని లేని పక్షంలో నిరుద్యోగ భృతి కల్పించడం జరుగుతుందన్నారు. నైపుణ్య ఆధారిత విద్య నిరుద్యోగ సమస్యకు పరిష్కారమన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ ఒక క్రమ పద్ధతిగా క్రమం తప్పకుండా నిరుద్యోగ యువత ప్రగతి కోసం జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. అంతకంతకు పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి విద్యా విధానాన్ని నైపుణ్య అభివృద్ధి దిశగా మలచవలసిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని వివిధ స్థాయిల్లో ప్రవేశపెట్టిందని తెలిపారు. ఏ ఉద్యోగానికైనా భావవ్యక్తీకరణ నైపుణ్యాలు తప్పనిసరని, నేడు నిరుద్యోగ యువతకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో సరైన ఉద్యోగ అవకాశాలు అందుపుచ్చుకోలేకపోతున్నారని అలా కాకుండా భాష పరిజ్ఞానం, నైపుణ్యాలు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి అవకాశాలు వస్తున్నాయన్నారు. విద్యార్థి దశలో నేర్చుకున్న పాఠశాలలకు ఆచరణాత్మకమైన సామర్థ్యాలు తోడైతే సునాయాసంగా సత్ఫలితాలు రావడంతో పాటు మంచి ఉద్యోగ అవకాశాలను చేజిక్కించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. పరిశ్రమలు సేవా రంగాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలను వికాస సంస్థ ద్వారా కల్పించడం అభినందనీయమన్నారు. వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు మాట్లాడుతూ మెగా జాబ్ మేళాలో 3,240 మంది తమ తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎస్.సుధా సాగర్, జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.